# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్రకళశాభిషేకం

తిరుమల, జూన్ 1 (ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని పంచబేరాలలో ఒకటైన భోగశ్రీనివాసమూర్తికి ఆదివారం ఉదయం ఆలయంలో ఏకాంతంగా ప్రత్యేక సహ స్రకళశాభిషేకం నిర్వహించారు. ఆలయంలోపల గరుడా ళ్వార్ సన్నిధిలో శ్రీదేవి భూదేవిసమేత మలయప్పస్వామి, భోగశ్రీనివాసమూర్తిని, విశ్వక్సే నులనుకొలువుదీర్చారు. అర్చకులు ప్రత్యేక సహస్రకళశాభిషేకం వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, విఎస్‌ఓలు ఎస్టీవి రామ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

## బోయకొండకు పోటెత్తిన భక్తజనం

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 1 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం లో భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెల వులు కావడంతో రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళ నాడు, తెలంగాణాల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలి వచ్చా రు. కొండ దినాన్ని పురష్క రించు కొని ఆలయ అర్చక, వేదపండితులు అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలం కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబర్ పర్య వేక్షణలో అధికార, అర్చక, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## భక్తజనసంద్రంగా తిరుమల



తిరుమల, జూన్ 1 ప్రభాతవార్తప్రతినిధి:

వేసవిసెలవులు ముగింపుకు వస్తుండటం, వరుససెలవులతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారాయి. ఆదివారం ఉదయానికే తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 22గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సి న పరిస్థితి ఉంది. ఈ రద్దీ ఇలాగే జూన్ 15వరకు కొనసాగుతుందని టిటిడి వర్గాల అంచనా. ఆదివారం సాయంత్రానికి 49వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా మరో 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. భక్తులకు నిరంతరాయంగా శ్రీవారి సేవకులు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ, తాగునీరు అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు క్యూలైన్లను అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, విఎస్‌ఓ ఎస్టీవిరామ్‌కుమార్,

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో పోటెత్తిన భక్తులు

### రికార్డుస్థాయిలో పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. రోహిణి కార్తె విశ్వరూపం ఆదివారం చూపింది. వారం రోజులుగా చల్లగా ఉన్న పుణ్యక్షేత్రం ఆదివారం ఒక్కసారిగా ఉక్కపోతతో తల్లడిల్లింది. ఏసిలకు పని చెప్పారు. అయితే ఇక్కడ వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి పొరుగున ఉన్న కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. వేకువ జాము నుంచే ఆలయంలో భక్తులు శివనామస్మరణ చేస్తూ పునీతం చేసారు. సాయంత్రం ఆలయాధికారులు అ ందించిన సమాచారం మేరకు పాతిక వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. అలాగే అబిషేకాలు 101 జరిగాయి, సాయంత్రం నిర్వహించే మహాన్యస పూర్వక ఏకాదశ రుద్రభిషేకాలు 40 జరిగాయి. కాగా రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు 6వేలు జరిగినట్లు వివరించారు. ఇక సంస్కరణలతో ప్రతి ఒక్కరు టిక్కెట్లు కొనుగోలు చేయాలనే నిబంధనలతో ప్రత్యేక దర్శనానికి వెళ్ళె భక్తులు అతిథులు సుమారు 8వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు వివరించారు. ఇక ప్రసాదాలు సుమారు పాతికవేలు అమ్ముడుపోయినట్లు వివరించారు.

### ప్రత్యేక పర్యవేక్షణ: భక్తుల తిప్పలు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన భక్తులకు సుదర్శనం కల్పించుటకు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఎన్నో పథకాలు, సంస్కరణలతో ముందుకు వెళుతున్నారు. అయితే దళారులు ఏదో ఒక దారిలో తమ పబ్బం గడుపుకొనుటకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పోలీసులు ముగ్గురు దళారులను అదుపులో తీసుకొని మందలించారు. ఎన్ని సంస్కరణలు అమలు చేస్తున్నా దళారులు సూక్ష్మంలోనే దారులు వెతుక్కుంటూ ముందుకు నడుస్తున్నారు. దర్శనాలకు భక్తులు తిప్పలుపడుతూనే ఉన్నారు. టిక్కెట్లు కొనుగోలు చేసినా సరైన సమాచారం లేనందువల్ల భక్తుల తిప్పలు వారివే అన్నట్లు మారింది.





శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి నిరీక్షిస్తున్న భక్తులు

# శ్రీవారిమెట్టు 500 మెట్టు వద్ద చిరుత

### భయాందోళనలో శ్రీవారి భక్తులు

చంద్రగిరి, జూన్ 1 ప్రభాతవార్త:

శ్రీవారిమెట్టు మార్గంలోని 500 మెట్టు వద్ద పొదల్లో చిరుతపులి వున్నట్లు భక్తులు టిటిడి సెక్యూరిటీ దృష్టికి తీసుకువచ్చారు. వేసవి సెలవులు కేవలం మరో 10 రోజులు మాత్రమే వుండటంతో తిరుమల శ్రీవారి భక్తుల తాకిడి విపరీతంగా వున్నది. ఈ నేపథ్యంలో ఆదివారం భక్తులు శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన తిరుమలకు వెళుతుండగా 500 మెట్టు సమీపంలోని ముళ్ళపొదల్లో చిరుతపులి సేదదీరుతున్నట్లు గుర్తించిన భక్తులు టిటిడి తెలియజేయడంతో భక్తులను నిలిపివేశారు. సైరన్ మోతల ద్వారా చిరుతను దూరంగా తరిమే వేసిందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం భక్తులను గుంపులు గుంపులుగా పంపించారు. చిరుతల సంచారం, ఏనుగుల దాడులపై ఇటు టిటిడి, అటు అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని శ్రీవారి భక్తులు చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



## గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలి

### - కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుమార్ స్వామి



గూడూరు, జూన్ 1, ప్రభాతవార్త

గ్రామస్థాయి నుండి భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేసి గ్రామస్థాయిలో గెలిచేందుకు కృషి చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురు పాటి కుమార్ స్వామి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు మండల పరిధిలోని చెన్నూరులో తిరుపతి జిల్లా కిసాన్ మోర్చా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు జిల్లా జోనల్ ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమార్ స్వామి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి పాల్గొ న్నారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కిసాన్ మోర్చా విభాగంలో భాగంగా మూడు నుండి ఐదు మంది రైతులతో కమిటీలు వేసి బలోపే తానికి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ స్థానిక సంస్థలతో పాటు, జరిగే ప్రతి ఎన్నికల్లోను బిజెపి అభ్యర్థులుగా పోటీ చేసేందుకు సిద్ధం కావాలి. మోడీ రైతులకు అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లోని ప్రతి ఇంటికి వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ కన్వీనర్ గాలి ప్రకాష్ నాయుడు, గూడూరు రూరల్ మండలం అధ్యక్షులు ఆల్తూరు కరుణాకర్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్, జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సన్నపురెడ్డి సురేష్ రెడ్డి గారు, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేంద్ర నాథ్ రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, కిసాన్ మోర్చా స్టేట్ ఇంచార్జ్ భారతి మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, స్టేట్ కార్యదర్శి ముని సుబ్రహ్మణ్యం, తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు చంద్రప్ప, బిజెపి సీనియర్ నాయకులు రవిచంద్ర రెడ్డి, రాయలసీమ కిసాన్ మోర్చా కన్వీనర్ శరత్ కుమార్ రెడ్డి, తిరుపతి జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి దండు అభిలాష్ రెడ్డి, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు ఇన్చార్జి అధ్యక్షులు నాగినేని నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

### - అర్జీదారులకు జిల్లా కలెక్టర్ పిలుపు

తిరుపతి కలెక్టరేట్, జూన్ 1 ప్రభాతవార్త :

ప్రతి సోమవారం జిల్లా కేంద్రం తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జూన్ నెల 2వ తేది (నేడు) సోమవారం రోజున ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల కేంద్రాలలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు అందరూ కలెక్టరేట్ నందు నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి, అలాగే డివిజన్, మండల కేంద్రాలలో పీజీఆర్ఎస్‌కు సంబంధిత అన్ని శాఖల అధికారులు ప్రతి సోమవారం తప్పక హాజరు కావాలని తెలిపారు. మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్‌సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే వారి యొక్క అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబుల్ వన్ డబుల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చునని కలెక్టర్ తెలిపారు.

### అత్యుత్సాహం

# ప్రాణం మీదకు తెచ్చింది...



రేణిగుంట జూన్ 1 ప్రభాతవార్త

తిరుపతి వెటర్నటి యూనివర్సిటీలో డైరీ టెక్నాలజీ కోర్సు నందు విద్యనభ్యసిస్తున్న విద్యార్థి రేణిగుంట మండలం మామండూరు రైల్వే స్టేషన్ వద్ద అత్యుత్సాహం ప్రదర్శించి ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. అందిన సమాచారం మేరకు తిరుపతి వెటర్నటీ యూనివర్సిటీలో డైరీ టెక్నాలజీ కోర్సు నందు విద్యనభ్యసిస్తున్న జాకెష్ (17) తన ఎనిమిది మంది మిత్రులతో కలిసి మామండూరు వాటర్ ఫాల్ వద్దకు తిరుపతి హుబ్లీ రైలులో తిరుపతి నుండి బయలుదేరారు. వీరంతా మామండూరులో దిగి రైల్వే లైను క్రాస్ చేయాల్సి ఉంది. అయితే మిత్రులంతా ట్రాక్ను దాటారు. రైల్వే ట్రాక్ పై ఆయిల్ ట్యాంకర్ల గూడ్స్ ఆగి ఉంది. జాకేష్ ఆయిల్ ట్యాంకర్ కు ఉన్న నిచ్చెనను ఎక్కి అవతల వైపుకు దిగాలన్న ప్రయత్నం చేశాడు. పొరపాటున రైల్వే ట్రాక్ పైనున్న హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి తీవ్ర విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. దాదాపు 90 శాతం కాలిన గాయాలతో పైనుండి కిందకు పడిపోయాడు. వెంటనే స్టేషన్ మేనేజర్ అక్కడకు చేరుకొని మిత్రుల సహాయంతో మార్గమధ్యంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడనుండి తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అతను రుయా ఆసుపత్రి నందు వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.. చికిత్స పొందుతున్న విషయాన్ని రైల్వే డిఎస్పి ధ్రువీకరించారు.

## ఘనంగా ఎల్లమ్మ భక్తుల అగ్నిగుండ ప్రవేశం

*నారాయణవనం, జూన్ 1 ప్రభాతవార్త :*



*మండలంలోని భీమునిచెరువు గ్రామంలో కొలువుదీరిన ఎల్లమ్మ తల్లి అమ్మవారి వార్షిక తిరునాళ్లలో భాగ ంగా ఆదివారం సాయంత్రం 6గంటలకు కంకణం ధరించిన సుమారు 100 మంది భక్తులు గోవింద నామస్మరణతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఐదు రోజుల క్రితం మొక్కుబడి కలిగిన యువ భక్తులు కంకణం ధరించారు. ఆదివారం ఉదయం హోమం నిర్వహించారు. రాత్రి అమ్మవారిని పుష్పా లతో అలంకరించిన తర్వాత ట్రాక్టర్‌పై సింహ వాహనంపై ఊరేగించారు. మొక్కుబడి కలిగిన యువకులు శరీరానికి ముళ్లగుచ్చుకొని వ్యానుపై వ్రేలా డారు. నారాయణవనం జడ్పీటీసీ కోనేటి సుమన్‌కుమార్, నారాయణవనం సర్పంచ్ కెజి శారదమ్మ కుమారుడు లక్ష్మణన్, సర్పంచ్ ఆరుముగం, మాజీ సర్పంచ్ సుధాబాబు, స్థానికులు రాజేష్, గోవిందరాజులు, మురళి, రమేష్, చీరాలయ్య, రాకేష్, సత్యరాజ్, హరిబాబు, స్థానిక భక్తుల పాల్గొన్నారు.*

# బోగస్ మస్టర్లతో రూ.లక్షల ఉపాధి నిధులు స్వాహా!

పాలసముద్రం, జూన్ 1 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు సిరుల పంట కురిపిస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళకుండా చేసి స్థానిక కూలీలకు స్థానికంగానే ఉపాధి కల్పించాలని సదుద్దేవంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి పథకం మండలంలో పక్కదారి పట్టింది. ఇంట్లో వుంటున్న వారి పేర్లను కూలీలుగా నమోదు చేసి వారి పేరిట జాబ్ కార్డులు సృష్టించి అక్రమార్కులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను తమ జేబుల్లో వేసుకుంటున్నారు. అక్రమార్కులకు ఉపాధి హామీ అధికారులు అండగా నిలుస్తుండటంతో మండలంలో ఈ పథకంలో జరిగే అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నది. ఉపాధి పేరుతో మండల పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడి సొమ్మును కాజేశారని ఆరోపణలు మిన్నంటుతున్నాయి. మండల పరిధిలో మొత్తం 13 గ్రామ పంచాయతీలు వుండగా ఒకటి రెండు గ్రామ పంచాయతీల్లో మినహా మిగిలిన అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పథకంలో అవినీతి యదేచ్ఛగా జరుగుతుంది. ఈ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు అక్రమార్కులతో చేతులు కలపడంతో కూలీలకు వెళ్ళాల్సి న ఉపాధి నిధులు పక్కదారి పడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో టెక్నికల్ అసిస్టెంట్లు చెరువుల్లో చేసిన పూడిక తీత పనులకు కొలతలు తీయడంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జరిగిన పనుల కంటే ఎక్కువ పని జరిగినట్లు రికార్డుల్లో నమోదు చేసి ఆ మొత్తంను టెక్నికల్ అసిస్టెంట్లు స్వాహా చేస్తున్నారు. కొన్ని చోట్ల కూలీలతో పనులు చేపట్టకుండా జెసిబిలతో పనులు చేసి కూలీలు ఆ పనులు చేసినట్లు రికార్డు చేసి లక్షల రూపాయలు దోచుకుంటున్నారు. ఉపాధి పనులను పర్యవేక్షించాల్సి న అధికారులు తమకు సంబంధం లేనట్లుగా వ్యవహంరిస్తున్నారు. మండలంలో జరుగుతున్న ఉపాధి అవినీతిపై జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్ళినా విచారణ జరపడానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గ్రామాల్లో అరాకొర పనులు చేసే సీనియర్ మేట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు కలిసి చేసిన పని కంటే ఎక్కువ బిల్లులు పెట్టి కూలీల నుండి అక్రమ వసూళ్ళకు పాల్పడినట్లు ఆరోపణలు మిన్నంటుతున్నాయి. గ్రామాల్లో వ్యాపాలు చేసుకుంటున్నా వారి పేర్లు, గ్రామాల్లో నివాసం వుండని వారి పేర్లు, ఉద్యోగాలు చేస్తున్న వారి పేర్లతో మస్టర్లు పెట్టుకుని నిధులు కాజేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బెంగళూరు, చెన్నైలో ఉద్యోగాలు చేస్తున్న వారి పేర్లతో సింగిల్ జాబ్ కార్డులు సృష్టించి యధేచ్ఛగా అక్రమ వసూళ్ళకు పాల్పడుతన్నప్పటికీ అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. ఉపాధి అవినీతిపై ఎపిఓకు ప్రజలు ఫిర్యాదు చేస్తే ఫిర్యాదు చేసే అధికారం ఎవరికి లేదని, మీ వల్ల ఏమి అయితే అది చేసుకోవచ్చునని స్పష్టం చేయడంతో ఫిర్యాదు చేయడానికి వెళ్ళిన ప్రజలకు ఎం చేయాలనేది పాలుపోని పరిస్థితి ఏర్పడింది. మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల అవినీతిపై జిల్లా స్థాయి అధికారులు దృష్టి కేంద్రీకరించి అవినీతికి పాల్పడిన వారి నుండి సొమ్మును రికవరీ చేసి ప్రభుత్వానికి జమ చేయాలని నిజాయితీగా ఉపాధి పనులు చేస్తున్న కూలీలు, ప్రజలు వేడుకుంటున్నారు.



జెసిబితో చేసిన పనులకు ఉపాధి అధికారులు బిల్లులు చెల్లించిన వైనం.

## శివయ్య సేవలో విద్యాశాఖ కమిషనర్

*శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త*



*శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయం భువు వాయు లింగేశ్వరుని దర్శనానికి ఆదివారం విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు కుటుంబసభ్యులతో వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. ఎఇఓ సతీష్‌మాలిక్ పిఆర్‌ఓ రవిలు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలను ఎఇఓఅందించారు. టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.*

## ఉపాధ్యాయుల బదిలీల జాతర

*శ్రీకాళహస్తిరూరల్, జూన్ 1 ప్రభాతవార్త*

*శ్రీకాళహస్తి మండలం బివిపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా సునీతను నియమించారు. గతంలో ఆమె రేణిగుంట మండలం అన్నాసంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తుండగా బివిపురానికి బదిలి చేసారు. కాగా ఏర్పేడు మండలంలోని మునగలపాళెం జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న పి.రాజవేలును బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఏర్పేడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా కెజ సునీతను కమ్మకండ్రిగకు బదలి చేసారు. పాపానాయుడుపేట పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పి.సునీతను కుప్పం మండలం న్యాపేటకు బదిలి చేయగా పంగూరు పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఏ విజయలక్ష్మిని గుడిపాల మండలం కొణతపల్లికి బదిలి చేసారు.*

## సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

కుప్పంరూరల్, జూన్ 1 ప్రభాతవార్త



మండలంలోని మల్లానూరులో ఆదివారం మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఆదివారం చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని ఆయన మల్లానూరులో ప్రారంభించి ప్రసంగించారు. వైకాపా పాలనలో డోర్ డెలివరీ పేరిట మహిళలను రోడ్డుపై నిలుచుకునేలా చేశారన్నారు. నేడు సిఎం చంద్రబాబునాయుడు మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా చౌక దుకాణాల ద్వారా సరుకులు అందేలా చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రామచంద్ర, నేతలు రమేష్, దామోదర్, విభూషణ్, వెంకటాచలపతి, వెంకటేష్, జయప్రకాష్, రాజ్‌కుమార్, ప్రకాష్, ఆర్ముగం, కుట్ట పాల్గొన్నారు.

## పండగ వాతావరణంలో నిత్యావసరాలు పంపిణీ



*శాంతిపురం, జూన్ 1 ప్రభాతవార్త* మండలంలోని ప్రభుత్వ చౌక దుకాణాల్లో ఆదివారం పండగ వాతావరణంలో ప్రజలకు నిత్యావసరాల పంపిణీని ప్రారంభించారు. తహశీల్దార్ శివయ్య, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సర్పంచ్ విజయరామిరెడ్డి అధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రజలకు సౌకర్యంగా డీలర్ల ద్వారా సరుకుల పంపిణీ చేపట్టడం జరుగుతోందన్నారు. ఈసందర్భంగా చౌక దుకాణాల వద్ద సిఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘ అధ్యక్షుడు చంద్ర, నేతలు రమేష్, నాగరాజు, చంద్ర, రాజారెడ్డి పాల్గొన్నారు.

## అట్టహాసంగా చౌకదుకాణాల్లో రేషన్ పంపిణీ ప్రారంభం



**రామకుప్పం, జూన్ 1 ప్రభాతవార్త** మండలంలోని ప్రభుత్వ చౌక దుకాణాల్లో రేషన్ సరుకుల పంపిణీ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. నేతలు మునస్వామి, పత్ర నారాయణ, ఆనందరెడ్డిలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన లోటుపాట్లకు తావివ్వక డీలర్లు ప్రజలకు సకాలంలో రేషన్ సరుకులు అందించాలన్నారు. ప్రతి నెల 1-15 తేదీల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డిటి బాలాజీ, నేతలు ఆంజనేయరెడ్డి, సీతాపతి, రామూర్తి, వెంకట్రామగౌడు, చలపతి, చిన్నికృష్ణ, రఫీ,జయశంకర్, సలాంసాబ్, రామకృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ ప్రారంభం

సదం, జూన్ 1, ప్రభాతవార్త



ముఖ్యమంత్రి పేద ప్రజలకు చౌక దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేయడము చారిత్రాత్మక నిర్ణయం అని తెలుగుదేశం పార్టీ నాయకులు వై శ్రీనివాసులు రెడ్డి ప్రసాద్ రెడ్డి మహేశ్వర్ రెడ్డిలు అన్నారు. ఆదివారం సదుం మండలంలోని బరగమంద సదుం 79 ఏ చింతమగులపల్లె లో చౌక దుకాణాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా చౌక దుకాణాలను మామిడి తోరణాలు పూలతో అలంకరించారు పండుగ వాతావరణంలో బియ్యం పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని ఎండియు వాహనాల ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని వాటి నుండి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేషన్ ద్వారానే బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో చెరుకువారిపల్లె మాజీ సర్పంచ్ విశ్వనాథరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు సునీల్ కుమార్ రెడ్డి ,సిరన్న గారీ పవన్ కుమార్, రఘునాథరెడ్డి, ఆనంద్ రెడ్డి, కృష్ణయ్య ,రమేష్,ఆరవపాలం రత్న, మునిరాజా, బూరగ మంద ఎంపిటిసి మల్లికార్జున, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## చౌకదుకాణాల నుంచే " రేషన్ " పంపిణీ

చౌడేపల్లి, జూన్ 1 ప్రభాతవార్త



ఇకపై చౌకదుకాణాల నుంచే నిత్యావసర సరుకుల పం పిణీ జరుగుతుందని తహశీల్దార్ హనుమంతు అన్నా రు. చౌడేపల్లి పరిధిలోని గోసలకురపల్లి, దిగువపల్లి పంచాయతీ కొలింపల్లిలల్లో గల చౌకదుకాణాల్లో నిత్యావసర సరుకులను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారం భించారు. మండలంలోని 33చౌకదుకాణాల పరిధిలో 13,274కార్డులున్నాయన్నారు. గతంలో విధంగా ఎండియుల నుంచి ఇకపై రేషన్ పంపిణీని ప్రభుత్వం రద్దు పరచి పాత పద్ధతిలోనే రేషన్ అందిస్తోందన్నారు. మండల వ్యాప్తంగా ఆయా పరిధిలోని చౌకదుకాణాల్లో టిడిపి నాయకులు, అధికారులు అట్టహాసంగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా సర్వర్లు మొరాయించడంతో కార్డుదారులు ఇబ్బందులు పడ్డారు.

## " వెన్ను పోటు "దినాన్ని విజయవంతం చేద్దాం : వైకాపా

చౌడేపల్లి, జూన్ 1 ప్రభాతవార్త



నియోజకవర్గ కేంద్రం పుంగనూరులో ఈనెల 4న నిర్వహించే " వెన్నుపోటు "దినాన్ని విజయవంతం చేద్దామని మండల వైకాపా అధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజులు పిలుపునిచ్చారు. స్థానికంగా జరిగిన మండల స్థాయి సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకిచ్చిన హామీలను మరచారన్నారు. ఈ మేరకు వైకాపా కేంద్రీయ కార్యాలయం, రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు మేరకు జరగబోయే వెన్నుపోటు దినానికి మండల నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఎంపిపి గాజుల రామ్మూర్తి, మాజీ ఎంపిపి రుక్మిణమ్మ, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, ఎంపిటీసీ సభ్యుడు తొండా శ్రీరాములు, సర్పంచులు ఓబుల్‌రెడ్డి, షంషీర్‌భాషా, లాజర్, హరినాథ్, కృష్ణారెడ్డి, షఫీ మండలంలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తల్లీబిడ్డలకు గాయాలు

చౌడేపల్లి, జూన్ 1 ప్రభాతవార్త



రోడ్డు ప్రమాదంలో తల్లీబిడ్డలకు గాయాలైన సంఘటన ఆదివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-బోయకొండ ప్రధాన రహదారిలో ఇటుగా వస్తున్న టూవీలర్ ఊటూరు మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో టూవీలర్‌పై ప్రయాణిస్తున్న సోమల మండలం నంజంపేట వడ్డిపల్లికి చెందిన జ్యోతి(30), లాస్య(4)లకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు 108సేవల ద్వారా పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## రేషన్ షాపుల వద్ద నిత్యవసర సరుకులు పంపిణీ

పూతలపట్టు, జూన్ 1, ప్రభాతవార్త



మండల కేంద్రంలో పూతలపట్టు రేషన్ షాప్ వద్ద నిత్యవసర సరుకులు ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రేషన్ షాపల వద్దనే ప్రజలకు ఎప్పుడు వీలైతే అప్పుడు తెచ్చుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ద్వంగులకు వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తామని రేషన్ సరుకులు వద్దనుకుంటే డిబిటి పద్ధతిలో నిత్యవసర సరుకులు ఇస్తామని ప్రకటించారు రేషన్ షాపుల జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 4 నుండి 8గంటల మధ్య పని చేస్తాయని ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటూరు మురళి, తాసిల్దార్ రమేష్ బాబు, సిఐ కృష్ణమోహన్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం

గుడుపల్లి, జూన్ 1 ప్రభాతవార్త



మండలంలోని కనమనపల్లి రేషన్ షాపులో నిత్య వసర సరుకులు పంపిణీ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్,నందమూరి తారకరామారావు,చిత్రపటాలకు పాలాభిషేకంచేశారు. అనంతరం నాయకులు సమన్వ య కమిటీ కన్వినర్ ఆర్.చంద్రశేఖర్,మండల అధ్యక్షుడు బాబునాయుడు,మండల మాజీ అధ్యక్షుడు హేమాంబర్ గౌడు, వెంకటేష్ జనసేన మండల అధ్యక్షుడు అమీర్, తాహాశీల్దారు శీతారాం, అధికారులు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో నిత్యవసర సరుకులు పంపిణీ చేసేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న ఈకార్యక్రమం చాలా సంతోషంగా వుందన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సుసౌక్యం కల్పిస్తారని,అదేవిధంగా నిరుద్యోగులకోసం మెగా డియస్సీ నిర్వహిస్తారని అన్నారు. కుప్పం ప్రజలు ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుకు రుణపడి ఉండాలన్నారు.ఈకార్యక్రమంలో ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్య..ఆనందకర జీవితానికి యోగా కీలకం

**– ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం**

కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త



ఆరోగ్యమైన ఆనందకర జీవితానికి యోగా ఎంతో కీలకమని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో యోగాపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 21న వైజాగ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంకు ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ హాజరవుతారన్నారు. ఈ నేపథ్యంలో నెలరోజులపాటు రాష్ట్రంలో యోగా శిక్షకులచే ప్రజలకు యోగాపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. యోగా దినోత్సవం నాడు కుప్పంలో మూడు వేలమందితో యోగా కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో కమీషనర్ శ్రీనివాసరావు, తహశీల్దార్ చిట్టిబాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, నేతలు డా॥ వెంకటేష్, ఆర్ముగం, మాణిక్యం, అశోక్, శ్యాంసుందర్, ఆర్ఐ వేణుగోపాల్, లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్ పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**– కడ పి.డి. వికాస్ మర్మత్**

కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట దాకా ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు సమస్యలపై నేరుగా వినతులు అందించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం ఆయన కోరారు.

## హాకింగ్స్ పాఠశాలపై దుష్ప్రచారం మానుకోండి - ఛైర్మన్ హఫీజ్

**– తల్లిదండ్రుల్లో ఆందోళన వద్దు.. స్కూల్ కొనసాగుతుంది !!**

కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త



కుప్పంలోని హాకింగ్స్ పాఠశాలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని స్కూల్ ఛైర్మన్ హఫీజ్ పేర్కొన్నారు. ఆదివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కావాలనే కొంతమంది ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నారని అలాంటి వారిపై చట్టపరంగా ముందుకెళ్తామన్నారు. తమ పాఠశాల అన్ని ప్రభుత్వ అనుమతలతో చట్ట ప్రకారంనడుస్తోందన్నారు. స్టేట్ బోర్డు అనుమతులు అన్నీ వచ్చాకే పాఠశాల తరగతులు ప్రారంభించామన్నారు. ఇప్పుడు కక్షసాధింపు చర్యలు ఎందుకని ప్రశ్నించారు. కుప్పంలో మంచి విద్యను అందించాలని ఇబ్బందులు ఎదురైనా పాఠశాల నిర్వహిస్తున్నామన్నారు. హాకింగ్స్ పాఠశాల మూత అనే తప్పుడు ప్రచారాలను మానుకోవాలన్నారు. తమ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి బాధ్యత తానే తీసుకుంటానన్నారు. సోషియల్ మీడియాలో కావాలనే తప్పుడు ప్రచారం మొదలు పెట్టారని ఇదంతా తనపై కావాలనే కుట్ర చేశారన్నారు. దీంతో హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు అధికారులు ఇచ్చిన నోటీసులను సస్పెండ్ చేసి అధికారుల వివరణ కోరిందన్నారు. పాఠశాలలో 1-12తరగతులను సిబిఎస్ఇ ద్వారా నిర్వహించేందుకు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ తీర్పుతో న్యాయంపై తమకు మరింత గౌరవం పెరిగిందన్నారు. సమావేశంలో స్కూల్ డైరెక్టర్ షబ్బీర్, రఫీక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు - అర్బన్ సిఐ

కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త



మైనర్లకు టువీలర్లు, ఫోర్ వీలర్ వాహనాలు నడిపేం దుకు ఇస్తే వారి తల్లిద ండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అర్బన్ సిఐ శంకరయ్య హెచ్చ రించారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలతో ఆదివారం కుప్పం పట్టణంలో టు వీలర్లు నడు పుతున్న పలువురు మైనర్లను పట్టుకుని వారి తల్లి దండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సిఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారికి జరిమానా విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. పిల్లలు కూడా ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. వీటిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. నిబంధనలు తెలియని మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు.

## అదృశ్యమై క్షేమంగా ఇంటికి చేరిన వృద్ధుడు

రామకుప్పం, జూన్ 1 ప్రభాతవార్త

మండలంలోని సింగసముద్రం గ్రామానికి చెందిన సుబ్బన్న అనే వృద్ధుడు క్షేమంగా ఇంటికి చేరాడు. ఇటీవల కడప జిల్లాలో జరిగిన మహానాడు కార్యక్రమంకు హాజరై తిరుగు ప్రయాణం సందర్భంగా ఇతను అదృశ్యమయ్యాడు. ఇతను కడప జిల్లా నుంచి రేణిగుంట చేరుకుని అక్కడ నుంచి తిరుపతికి వెళ్లి పోలీసులను సంప్రదించాడు. దీంతో పోలీసులు అతన్ని కుప్పం చేర్చేందుకు సహకరించారు. సుబ్బన్న క్షేమంగా ఇంటికి చేరడంతో కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అవినీతికి ఆస్కారం లేకుండా రేషన్ సరుకుల పంపిణీ



ఎమ్మెల్యే మురళీమోహన్

**తవణంపల్లె, జూన్ 1 ప్రభాతవార్త:** అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు రేషన్ సరుకులు పంపిణీ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మండలం లోని మైనగు ఒడ్లపల్లె గ్రామ పంచాయతీ ముత్తరపల్లె గ్రామంలో రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ కార్యక్రమంను ఆయన ప్రారంభించారు.ఈసందర ్భంగా గ్రామంలోని వృద్ధులకు ఇళ్ళ వద్దనే ఎమ్మెల్యే చేతుల మీదుగా సరుకులు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతికి ఎక్కడా ఆస్కారం లేకుండా ప్రతి కార్డుదారుడికి రేషన్ బియ్యం అందించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ప్రజల సమస్యలను గుర్తించి పాత పద్దతిని అమలు చేస్తూ మంచి నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే మురళీ తెలిపారు. ఈకార్యక్రమంలో మండల తహశీల్దార్ సుధాకర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌నాయుడు, మండల అధ్యక్షుడు దిలీప్‌నాయుడు, బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ ఒడ్డుపల్లె భాస్కర్‌నాయుడు, నాయకులు పట్నం గోపి,లవకుమార్‌లతో పాటు పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా మేజర్ గ్రామపంచాయతీ అరగొండ రేషన్‌షాపులో సర్పంచ్ మల్లుదొరై సరుకుల పంపిణీని ప్రారంభించారు.

## నేడు పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు, జూన్ 1 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు సోమవారం చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి పరిష్కరించనున్నారు. జిల్లాలోని ప్రజలు ఏదేని సమస్యలు వుంటే సోమవారం ఎస్పీ మణికంఠ చందోలను కలిసి పరిష్కరించుకోవచ్చును.

## నేడు పులిగుండులో యోగాంధ్రా

**– కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, జూన్ 1 ప్రభాతవార్త:

పెనుమూరు మండలం పులిగుండు వద్ద సోమవారం యోగాంధ్రా కార్యక్రమం నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా పర్యాటకశాఖ అధికారిణి గౌరిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆదివాకం కలెక్టర్ సుమిత్‌కుమార్ యోగాంధ్రా కార్యక్రమం నిర్వహణపై వివిధ శాఖల అధికారులు, ఆయూష్ నోడల్ అధికారులు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా పర్యాటక ప్రాంతాల్లో యోగ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో భాగంగా ఇది వరకే కాణిపాకంలో నిర్వహించడం జరిగిందన్నారు. పెనుమూరు పులిగుండు ఆలయ సమీపంలో యోగాంధ్రా కార్యక్రమం సోమవారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులను భాగస్వాములను చేయాలన్నారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**– కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, జూన్ 1 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంటలకల్లా హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. అలాగే ప్రజలు తమ సమస్యలను ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సంబంధిత అధికారులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు విధిగా హాజరై అక్కడి ప్రజల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

## చౌక దుకాణాల్లో నిత్యవసర వస్తువుల పంపిణీ ప్రారంభం

**– కాజూరులో ప్రారంభించిన చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత**

చిత్తూరు, జూన్ 1 ప్రభాతవార్త:



చౌక దుకాణాల్లో బియ్యం, ఇతర నిత్యవసర వస్తువు లను రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేసే కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రారంభమైంది. గత ప్రభుత్వం వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ కార్యక్రమంను అమలు చేయగా ప్రస్తుత ప్రభుత్వం వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని కార్డుదారులకు చౌక దుకాణాల్లోనే బియ్యం, ఇతర నిత్యవసర వస్తువులను అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా జూన్ 1వ తేదీ అయిన ఆదివారం చౌక దుకాణాల వద్ద బియ్యం, ఇతర నిత్యవసర వస్తువులను రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయడం ప్రారంభమైంది. చిత్తూరు కాజూరులోని చౌకదుకాణంలో రేషన్ కార్డుదారులకు ఆదివారం చుడా ఛైర్‌పర్స న్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్, చిత్తూరు తహసిల్దారు చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొని బియ్యం, ఇతర నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, జూన్ 1 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థా నంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకా నికి ఓ భక్తురాలు ఆదివారం లక్ష రూపాయలను విరా ళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతికి చెందిన భాగ్యవతి అనే భక్తురాలు నిత్యాన్నదాన పథకంకు 1,00,016 రూపాయలు విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## బడుగుమాకులపల్లి సంతలో భారీగా ట్రాఫిక్ జామ్

శాంతిపురం, జూన్ 1 ప్రభాతవార్త



కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో బడుగుమాకులపల్లి వారపు సంత వద్ద ఆదివారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు సైతం ట్రాఫిక్ క్లియ రెన్స్‌కు అవస్థలు పడ్డారు. జాతీయ రహదారి పక్కనే సంత జరుగుతున్న నేపథ్యంలో తరచూ ఈ సమస్య ఏర్పడుతోంది. వారపు సంతకు కర్నాటక, తమిళ నాడు నుంచి సైతం భారీగా వ్యాపారులు వాహనాల్లో వస్తుంటారు. వాహనాలకు సరైన పార్కింగ్ లేక పోవడంతో సమస్య తలెత్తుతోంది. ఉదయం 6-9గంటల మధ్య తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలుగు తోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## అక్రమ మద్యం విక్రయిస్తున్న వృద్ధురాలిపై కేసు నమోదు

చౌడేపల్లి, జూన్ 1 ప్రభాతవార్త



అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వృద్ధురాలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు...మండలంలోని పెద్దయల్లకుంట్ల పంచాయతీ ఊటూరులో అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారమొచ్చింది. వెంటనే వెళ్ళి దాడి చేయగా అదే గ్రామానికి చెందిన రెడ్డెమ్మను అదుపులోకి తీసుకొని ఆమె నుంచి 25ఆంధ్ర మద్యం క్వార్టర్ బాటిళ్ళను స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

## వెన్నుపోటు పోస్టర్లు ఆవిష్కరణ

పుంగనూరు రూరల్, జూన్ 1 ప్రభాతవార్త



పట్టణంలో వైకాపా పార్టీ ఆదేశాల మేరకు వెన్నుపోటు దినం పోస్టర్లను ఆదివారం వైకాపా నాయకులు ఆవిష్కరించారు. మాజీ ఎంపీ రెడ్డప్ప మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ భాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, రాష్ట్ర వైకాపా యూత్ యుక్త కార్యదర్శి చెంగారెడ్డి, వైఎస్ఆర్సీపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారాయణ సినర్జీ 2025 విజయవంతం



**తిరుపతి విద్య, జూన్ 1 ప్రభాతవార్త** నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అకాడమిక్ మరియు నాన్ అకాడమిక్ విభాగాల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి నిర్వహించిన సినర్జీ 2025 వర్క్ షాప్ విజయవంతంగా జరిగింది. యోగ,మెడిటేషన్,సైకాలజిస్టుల పర్యవేక్షణలో మానసిక వికాసానికి సంబంధించి అంశాలపై శిక్షణ మరియు వివిధ విభాగాల మధ్య సమన్వయం తదితర అంశాలపై స్థానిక రాహుల్ కన్వెన్షన్ హాల్ నందు రెండు రోజుల వర్క్ షాప్ డిజీఎం కొండలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.వివిధ రంగాలలో నిష్ణాతు లు, సంస్థ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్,కోర్ మెంబర్ రమణకుమార్,మానవ వనరుల అధినేత రమేష్,అకాడమిక్ కోఆర్డినేటర్ బ్రహ్మాజీ డీన్లు ఏజీఎంలు ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## ఎన్ఈపి 2020 లక్ష్యాను సాధించేలా వర్శిటీలకు నీయట్ చేయూత

తిరుపతి విద్య, జూన్ 1 ప్రభాతవార్త

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (నెప్పి) 2020 మార్గదర్శకత్వంలో భారతదేశ విద్యా వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ మార్పులో యూజీసీ, ఐసిట్ సంస్థలు విద్యను, నైపుణ్యానికి పెద్దపీట వేసేలా మార్చేందుకు ఎంతగానో కృషి చేస్తూ, అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఈ ఆశయాన్ని వేగంగా ముందుకు తీసుకు వెళ్లడానికి నెక్ట్‌వేవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్డ్ టెక్నాలజీస్ (నీయట్) ప్రారంభించిన యూనివర్సిటీ భాగస్వామ్య మోడల్ ని, దేశంలోని పలు యూజీసీ అప్రూవ్డ్ యూనివర్సిటీలు అమలు పరుస్తున్నాయి అని నెక్ట్‌వేవ్ అండ్ నీయట్ కో ఫౌండర్, సీఈవో రాహుల్ అత్తులూరి అన్నారు.ఈ సందర్భంగా ఆదివారం అయన విలేకరులతో మాట్లాడుతూ నైపుణ్య ఆధారిత విద్యకు దేశవ్యాప్తంగా అనుకరించదగినదిగా ఈ మోడల్ స్ఫూర్తిదాయకంగా నిలిచింది.విద్యార్థులకు చక్కటి కెరియర్ ఫలితాలు తీసుకువచ్చేలా యూనివర్సిటీలను బలపరచడమే ఈ భాగస్వామ్యం లక్ష్యం" అన్నారు. ఒకవైపు యూనివర్సిటీ అకడమిక్ ప్రోగ్రామ్‌ను తమదైన విధంగా కొనసాగిస్తుంది అని తెలిపారు.

## పండుగ వాతావరణంలో నిత్యావసర సరకుల పంపిణీ



***విజయపురం, జూన్ 1 ప్రభాతవార్త:*** పండుగ వాతావ రణంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమం జరుగుతోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్క ధనంజయ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లోని రేషన్ షాపుల నుంచి సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు లబ్ధిదారులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని విజయపురం, మిట్టూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌తో పాటు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్క ధనంజయ యాదవ్ నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, వీఆర్వో మేఘనాథం, డీలర్ కృష్ణ మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు రఘురాజు, హరికృష్ణమరాజు, హరిరాజు, రమేష్, లక్ష్మయ్య, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నిరంతరాయంగా 15 రోజులు రేషన్ సరుకులు పంపిణీ.

**రేణిగుంట జూన్ 1 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం సాయంత్రం నిరంతరాయంగా రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా అన్నారు. రేణిగుంట మండలం అన్నాసంపల్లె పంచాయతీలో బిజెపి యువ నాయకులు వెంకటాద్రి యాదవ్ దగ్గరుండి డీలర్లతో రేషన్ సరుకులు పంపిణీ చేయించారు. రేణిగుంట మండలం గుత్తి వారి పల్లి పంచాయతీలో కొత్తగా డీలర్ షాపును టిడిపి సీనియర్ నాయకులు మునస్వామి నాయుడు , బిజెపి మండల అధ్యక్షులు పూజారి ప్రేమ్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయ కృష్ణ, వీఆర్వో రాజేష్ తదితరులు ప్రారంభించి, లబ్ధిదారులకు బియ్యం, కందిపప్పు, చక్కెర ప్యాకెట్లు అందజేశారు.

## రేషన్‌సరుకులు పంపిణీ

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 1 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ షాపులను పునర్నిర్మాణం చేపట్టిన కారణంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి రెడ్డివారి గుర వారెడ్డి సారధ్యంలో మండలంలోని బందారుపల్లి, మన్నసముద్రం, పాపానాయుడు పేట,మర్రిమంద, రాజులకండ్రిగ, కొత్తవీరాపురం గ్రామాల్లో పేద ప్రజలకు నిత్యావసర సరకులు అందించి రేషన్‌షాపులను పున:ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకుఉపయోగపడేటువంటినిర్ణయాన్ని తీసుకొని రేషన్‌షాపుల ద్వారానే నిత్యావరసర సరుకుల నుఅందించాలని ధృఢసంకల్పంతో రేషన్‌షాపుడీలర్ల ద్వారా ప్రజలకు నిత్యావసరసరుకులను అందుబాటులోకి తెచ్చి నిర్ణయం తీసుకోవాడం చాలా గొప్పపరిణామమన్నారు. . కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు, నైనారు పొన్నారావు, పేరం ధనంజయులునాయుడు, మోహన్‌నాయుడు, మురుగన్, నిరంజన్ నాయుడు, రవి నాయుడు, కేశినేని సుబ్రమణ్యం, రాచేటి సుబ్రమణ్యం, గుణ యాదవ్, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## నెమళ్ళూరు హర్షిణికి బహుమతిప్రదానం

శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త



పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, కవితల కుమార్తె నెమళ్ళూరు హర్షిణికి రాష్ట్ర గాండ్ల తెలికుల సంక్షేమ సంఘంచే ఘనంగా సత్కరించి బహుమతి ప్రదానం చేశారు. ప్రతిఏటా లాగే నెల్లూరుపట్టణంలో నిర్వహించే గాండ్ల తెలికుల సంక్షేమ ఆధ్వర్యంలో గాండ్ల కులానికి చెందిన 10వ తరగతి, ఇంటర్మీడియట్‌పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభనుకనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా గాండ్ల తెలికుల రాష్ట్ర అధ్యక్షులు గ్రోస్ సుబ్బారావు అధ్యక్షతన గ్రోస్‌గోపాలయ్య, మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రోస్ సుబ్బారావు, ప్రముఖ సినీ నటుడు బాలాజీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు వన్నెవాకం గురుదశరధన్, ప్రధాన కార్యదర్శిశ్రీనివాసులు, శ్రీకాళహస్తి అధ్యక్షులు బిఆర్‌రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సహాయం:

తొట్టంబేడు,జూన్ 1 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలంలో సుమారు 20 సంవత్స రాలుగా జర్నలిస్టుగా పని చేస్తూ హఠాన్మరణం చెందిన చిట్టత్తూరు మెహర్ కుటుంబాన్ని ఆదుకొనుటకు పలువురు ముందుకు వచ్చారు. ఈ నేపధ్యంలో ఆదివారం మాజీ కౌన్సిలర్ ప్రస్తుతం తెలుగుదేశం మీడియా ఇన్‌చార్జి నాగమల్లి దుర్గా ప్రసాద్ తన వ్యక్తిగతంగా సహాయం అందించారు. మెహర్ తల్లికి రూ.10వేలు సాయం అందించారు. మెహర్ తన క్లాస్‌మెంట్ అని విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించే ఓ మంచి స్నేహితుని పొగొట్టుకున్నామన్నారు.జర్నలిజం విలువలను కాపాడటంలో ప్రజల సమస్యలపై అధికారులను జాగృతపరుస్తూ 20 సంవత్సరాల పాటు సేవలందించారని వివరించారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా సరకులు అందించండి

వడమాలపేట, జూన్ 1 ప్రభాతవార్త:



రేషన్ డీలర్లు ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా సరకులు అందజేయాలని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులునాయుడు కోరారు. ఆదివారం మండలంలోని పాదిరేడు గ్రామంలో రేషన్‌షాపులో అధికారులతో కలసి సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జరీనా, ఆర్ఐ జానీ బాషా, వీఆర్‌వోలు సుమన్, చక్రవర్తి, పార్టీ అధ్యక్షుడు దాముయాదవ్, కార్యదర్శి శివరాయల్,నాయకులు హేమావతి, లక్ష్మిప్రసన్న, సురేష్, మునిశేఖర్, వినోద్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ చేతులు మీదుగా రేషన్‌షాపులు పున:ప్రారంభం

నారాయణవనం, జూన్ 1 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల్లోనే నిత్యవసర సరుకులను అందించాలని ప్రకటించడంతో ఆదివారం నారాయణవనం-6షాపులో జడ్పీటీసీ కోనేటి సుమన్‌కుమార్ పున:ప్రాంభించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం వాహనాల ద్వారా రేషన్ సరుకులను అందించేవారు. అయితే అది ప్రభుత్వానికి భారంగా మారడంతో ప్రభుత్వ ఆదాయం కోసం వాహనాల ద్వారా సరుకులను అందించే కార్యక్రమంను రద్దు చేవారు. జూన్1 నుంచి రేషన్ డీలర్ ఇంటి వద్ద నుంచే అందించే కార్యక్రమంలో జడ్పీటీసీ పాల్గొన్నారు. అనంతరం లబ్దిదారులకు సరుకులను అందించారు. కార్యక్రమంలో తహశీల్దారు జయరాములు, సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్ తనయుడు లక్ష్మీణన్, ఉపసర్పంచ్ ప్రభావతి దొరైరాజ్, గుడ్డల గురుస్వామి, గోవిందశెట్టి, మోహన్, సొరకాయులు, కుమార్, సుధాబాబు, పిజి ముఖేష్, గుజ్జెలి మహేష్, హరిబాబు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో టిడిపి అబ్జర్వర్ చంద్రశేఖర్‌నాయుడు సుడిగాలి పర్యటన

సత్యవేడు, జూన్ 1 ప్రభాతవార్త:



సత్యవేడులో డీలర్ సుకూర్ బాయ్, రేషన్‌షాపు-04ను ఆదివారం సత్యవేడులో టీడీపీ పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు అధ్యక్షతన మాజీ ఎంపీపీ మస్తాన్ అట్టహాసంగా పునఃప్రారంభించి లబ్ధిదారులకు రేషన్ సరకులను అందించారు. ఇక్కడకు విచ్చేసిన నాయకులను శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రేషన్‌సరకుల పంపిణీలో జరిగిన వైఫల్యాలను ఎండగట్టారు. అక్రమ రేషన్ బియ్యం రవాణాకు వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలు ప్రధాన కారణంగా పేర్కొన్నారు. రేషన్ దుకాణాలు పునఃప్రారంభంతో అక్రమ రేషన్‌బియ్యం రవాణాను అరికట్టడమే కాకుండా, పేదలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గం మండలాల వారిగా నాగలాపురం, నారాయణవనం, కేవీబీ పురం, వరదయ్యపాళెం, పిచ్చాటూరు మండలంలో రేషన్ దుకాణాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్ రెడ్డి, రామాంజులనాయుడు, గోపిరెడ్డి, తిరుమలరెడ్డి, సతీష్‌నాయుడు, పద్మనాభరాజు, బాలసుందరం రెడ్డి, చికెన్ చిన్న, రుద్రయ్య, టీడీపీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జనసేన క్రియాశీలక సభ్యత్వం కిట్ల పంపిణీ

సత్యవేడు, జూన్ 1 ప్రభాతవార్త:



మండల పరిధిలోని బాలకృష్ణాపురంలో మండల అధ్యక్షుడు శ్రీ కూరకుల రూపేష్ సమక్షంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూపేష్ మాట్లాడుతూ బీమా పథకాల గురించి ప్రజలకు మరింత వివరించారు. ఈ విడతలో ఇంతకు ముందుకన్నా ఎక్కువ సభ్యత్వాలు రావడం అందులోను మహిళలు అధికంగా చేసుకోవడం జరిగింది. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు హేమంత్, సెక్రటరీ అనిల్‌కుమార్, జ్యోతికుమార్, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ మారమ్మ జాతరలో మాజీ శాసనసభ్యులు బియ్యపు

రేణిగుంట జూన్ 1 ప్రభాతవార్త

రేణిగుంట మండలం ఎస్సార్ పట్టెడ గ్రామం లో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ మారమ్మ జాతర మహోత్సవంలో ఆదివారం మాజీ శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని ఘనంగా ఆహ్వానించి అమ్మవారి దర్శనం చేయించారు. దర్శనానంతరం ఆయనకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తిరుమలరెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, జడ్పిటిసి సంధ్యారాణి, శేఖర్ బాబు, గంగయ్య, చంద్ర, మునిశేఖర్, ప్రభాకర్, పళని, శీను, ఆనందరావు, ముని రెడ్డి, ధనుంజయులు పాల్గొన్నారు..



## తిప్పారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణ గౌడ్

తిరుపతి విద్య జూన్ 1 ప్రభాత వార్త



డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల అధినేత డాక్టర్ తిప్పారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ జ్ఞాపికతో సత్కరించారు.నారాయణ గౌడ్ మాట్లాడుతూ నిత్యం చిరునవ్వుతో పలకరించే మంచి మనసున్న పేద విద్యార్థుల పక్షపాతి ఎంతోమంది న్యాయమూర్తులు న్యాయవాదులను తయారుచేసిన గొప్ప విద్యా ప్రదాత తిప్పారెడ్డి అని కొనియాడారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించే విధంగా ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారి ఆశీస్సులు ఆయనకు మెండుగా ఉండాలని మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరారు.

## వ్యాపారాన్ని చేపల మార్కెట్టులో నిర్వహించుకోండి

శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త



పట్టణంలోని డాక్టర్ బత్తెనయ్య ఆస్పత్రి ఎదురుగా నిర్వహి స్తున్న చేపల వ్యాపారాన్ని చేపలమార్కెట్‌లో నిర్వహించుకో వాలని కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్యనాయుడు పేర్కొన్నారు. ఇక్కడ చేపల వ్యాపారం నిర్వహించుకోకూడదని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగినదని అయిననూ సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ మేరకు ఆదివారం అక్కడ వ్యాపారం నిర్వహిస్తున్న చిరువ్యాపారస్తులతో ఆయన మాట్లాడుతూ చేపల మార్కెట్‌లో వ్యాపారం నిర్వహించుకోవాలని కోరగా, తాము మున్సిపల్ కార్యాలయానికి కిస్తు చెల్లిస్తున్నామనిఇక్కడే వ్యాపారం నిర్వహించుకుంటామని తెలిపారు. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించకుంటే కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని తెలియజేశారు.

## రేషన్‌షాపుల ద్వారానే సరుకులు పంపిణీ

శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త



రేషన్ షాపుల ద్వారా మాత్రమే సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆర్‌డిఓ భాను ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం 12, 15వార్డుల యందు తెల్లరేషన్‌కార్డుదారులకు రేషన్‌సరుకుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌డిఓ భానుప్రకాష్ మాట్లాడుతూ 15వ తేది వరకు ఉదయం నుండి సాయంత్రంవరకురేషన్‌షాపులు అందుబాటులో వుంటాయని తెలిపారు. టిడిపి పట్టణాధ్యక్షులు జి. విజయ్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రేషన్‌సరుకులను వాహనాల ద్వారా అందిస్తామని రేషన్‌బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించి, లక్షల కోట్లు దండుకున్న ఘనత వుందన్నారు. కార్యక్రమంలో రేషన్ షాప్ డీలరు మునికుమార్, వివేక్, మస్తాన్, క్లష్టర్ ఇన్‌చార్జి కంఠా రమేష్, షఫి, ఆర్ముగం, రమణ, రూకేష్, గిరి, మధు, గోపాల్, బత్తయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 9 మోటార్‌సైకిళ్ళు: ఒక ఆటో సీజ్

శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో నేర నియంత్రణలో భాగంగా పోలీసులు గాలిస్తున్నారు. శ్రీకాళహస్తిలోని వన్‌టౌన్,టూ టౌన్,రూరల్,తొట్టంబేడు పోలీసు స్టేషన్ల పరిధిలో రేయింబవళ్ళు బూజింగ్ జరుపుతున్నారు. ఆదివారం వేకువ జాము వన్‌టౌన్ సిఐ డి.గోపి వారి సిబ్బంది పట్టణానికి సమీపంలోని తుఫాన్‌సెంటర్‌లో కార్డ్ అండ్ సెర్చ్‌లో భాగంగా పరిశీలనలు జరిపినట్లు వివరించారు.ఈ పరిశీనలో రికార్డుల్లేని 9మోటార్‌సైకిళ్ళను ఒక ఆటోను సీజ్ చేసినట్లు వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి పరిసరాల్లో శాంతి భద్రతలను అదుపు చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని సిఐ గోపి వివరించారు.ప్రతి రోజూ సెర్చ్ చేస్తున్నామని తెలిపారు.

## ఎంత కాలం ఈ దాష్టికాలు?

ఉమేష్‌రావు

శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త



ప్రభుత్వం మారినా నాటి వైకాపా సైకోల తీరుమారలేదని ఎక్కడో ఓ చోట దాష్టికానికి పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం. ఉమేష్‌రావు వారి సహచరులు ధ్వజమెత్తారు. పట్టణంలోని తెలుగుదేవం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుని వివాహ వేడుకల సందర్భంగా కొందరు సైకోల్లా వ్యవహరించటం బాధాకరమన్నారు. ఇబ్రహింపట్నంలో అటుగా సైకిల్ తొక్కుకుంటూ వెళుతున్న ఓ పసిపిల్లాడి సైకిల్‌ను లాక్కుని దానిపై వారి వికృత రూపాన్ని ప్రదర్శిస్తూ పైశాచికానందాన్ని పొందటం గమనిస్తే వారి మానసికపరిస్థితిపై సందేహం వేస్తుందన్నారు.పసిబాలునిపై దాడిచేయటం వారి వికృతానందానికి నిదర్శనం అన్నారు. ఈ సమావేశంలో దేశం ప్రముఖులు మిన్నల్ రవి, మునిరాజాయాదవ్, నాయిబ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ కోట చంద్రశేఖర్, రెడ్డివారి మునిశంర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణపై కఠినంగా వ్యవహరించండి:

శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగుమాడావీధులు, జయరామారావువీధుల్లో ట్రాఫిక్ నియంత్రణపై సంబంధిత సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని ఆదివారం సాయంత్రం సిఐ డి.గోపి సూచించారు. నూతనంగా నియమించిన ట్రాపిక్‌ఆ ర్ ఎస్ఐ గోవిందు, మునస్వామిలకు దిశ దెశ నిర్దేశం చేసారు.ఆదివారం ఉదయం నుంచి ట్రాఫిక్ నియంత్రణపై పర్యవేక్షించిన వారికి సిఐ సూచనలు చేసారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో రోడ్లు ఇరుకైందన్నారు.ఇందులోనే వాహనాలు. వన్‌సైడ్ పార్కింగ్ నిర్వహిస్తున్నారన్నారు.కాబట్టి ఎవ్వరికి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను పర్యవేక్షించాలన్నారు. దుకాణం దారులు సహకరించాలని సూచించారు.ముఖ్యంగా పెండ్లి మండపం కూడలి వద్ద నిత్యం నాలుగువైపుల నుంచి వచ్చే వాహనాలతో రద్దీగా ఉంటుందని ఇక్కడ పని చేసే సిబ్బంది జాగ్రత్తగా పని చేయాలని సూచించారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

తొట్టంబేడు (శ్రీకాళహస్తిరూరల్), జూన్ 1 ప్రభాతవార్త



ముఖ్యమంత్రినారా చంద్రబాబునాయుడు, పౌర సరఫరా శాఖామంత్రినాదెండ్లమనోహర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి రేషన్‌షాపులు పున:ప్రారంభించినమేరకు తొట్టంబేడు మండలంలోని గుండేలిగుంట, విరూపాక్షపురం గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ మండల పార్టీ మాజీఅధ్యక్షులు గాలి మురళినాయుడు ఆధ్వర్యంలో రేషన్‌షాపులను పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల 1నుండి 15వతేది వరకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు రేషన్ షాపులుఅందుబాటులో వుంటాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే 65 సంవత్సరాలుపైబడినవృద్ధులు, వికలాగులంకు ఇంటి వద్దకేసరుకులను పంపిణీచేయాలని సూచించారు. అవినీతి వుండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకూటమి ప్రభుత్వం అర్హులైన లబ్దిదారులకు నాణ్యమైన బియ్యం, కందిపప్పు, చక్కెర మొదలైన సరుకులను రేషన్‌షాపుల ద్వారానే అందిస్తున్నామనితెలిపారు. కార్యక్రమంలో రేషన్‌షాపు డీలర్లు జయంతి, వాణిప్రియ, రమేష్, గోపాల్‌యాదవ్, కాళయ్య, పాండురెడ్డి, జ్ఞానమ్మ, సుబ్బమ్మ, నాగమ్మ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేడాంలో పొంగళ్ళు

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 1 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం వేడాం మిట్టకండ్రిగలో మంగళవారం జాతర నిర్వహించనున్నారు. ఈమేరకు ఆదివారం మధ్యాహ్నం నుంచి గ్రామస్థులు గంగమ్మ అమ్మవారికి భారీ ఎత్తున పొంగళ్ళు సమర్పించారు. స్వర్ణముఖి తీరాన వెలసిన గ్రామం వేడాం మిట్ట కండ్రిగ. గ్రామానికి సమీపంలో దక్షిణ కాళిమాత వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తుంది. ఈ నేపధ్యంలో గ్రామం జాతర సంబరాల్లో తలమునకలై ఉంది. పొంగళ్ళతోప్రారంభమైన జాతర సంబరాలు మంగళవారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవంతో ముగుస్తుంది

## ఘనంగా నీలం సంజీవరెడ్డి వర్ధంతి

తిరుపతి విద్య. జూన్ 1 ప్రభాతవార్త



ఎస్వీయూలో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఆదివారం వర్సిటీలోని ఆయన విగ్రహానికి వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఎస్వీయూ స్థాపనలో కీలక పాత్ర పోషించడంతో పాటు రాయలసీమ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన దార్శనికులు నీలం సంజీవరెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మీడియా డీన్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు,ఇంచార్జి ఇంజనీర్ తాండవకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## పేదల లబ్ధికే రేషన్ షాప్‌లు : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి విద్య. జూన్ 1 ప్రభాత వార్త



పేదలకు పారదర్శకంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం కోసమే చౌక ధరల దుకాణాలు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతిలోని పెద్దకాపు లే అవుట్ లోని 34వ రేషన్ షాప్ ను ఆదివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు.అనంతరం రాఘవేంద్ర నగర్ లోని 75 వ షాప్, మాధవనగర్ లోని 74వ షాప్ ను ఎమ్మెల్యే ప్రారంభించి సరుకులను లద్దిదారులకు అందించారు.నగరంలో 102 చౌక ధరల దుకాణాలు ద్వారా పేదలకు బియ్యం తో పాటు నిత్యావసర సరుకులు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రతి నెలా ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు సరుకులను లద్దిదారులకు డీలర్లు అందిస్తారని ఆయన చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సరుకులు అందిస్తారని ఆయన తెలిపారు. 65 ఏళ్ల పైబడిన వారికి, దివ్యాంగులకు రేషన్ డీలర్లే ఇంటి వద్ద సరఫరా చేస్తారని ఆయన చెప్పారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో పేదలకు వాహనాల ద్వారా రేషన్ అరకొరగా పంపిణీ చేసి మిగిలిన బియ్యాన్ని కాకినాడ, విశాఖ పోర్ట్ ల ద్వారా అక్రమంగా విదేశాలకు తరలించి కోట్లు దండుకున్నారని ఆయన ఆరోపించారు.అలాగే పదహారు వందల కోట్లతో వాహనాలు కొని దుబారా చేశారని ఆయన విమర్శించారు. పేదలు బియ్యం, ఇతర నిత్యావసరాల కోసం ఎటువంటి ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు తిరిగి చౌక ధరల దుకాణాలను తీసుకొచ్చారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి రాజు, ఆర్డీఓ రాంమోహన్, అర్బన్ తహశీల్దార్ భాగ్యలక్ష్మి, ఎన్డీఏ నాయకులు పులిగోరు మురళీ , డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్ లు ఎస్కె బాబు, అన్నా అనితా, సింగంశెట్టి సుబ్బరాయులు, దొడ్డ రెడ్డి శ్రీనివాసలురెడ్డి, దొడ్డరెడ్డి రామకృష్ణా రెడ్డి, రాజా రెడ్డి, ఆకేపాటి సుభాషిణి, మహేష్ యాదవ్, భరణి యాదవ్, హేమంత్ కుమార్ యాదవ్, దూది శివ, బాలాజీ, సానె శ్రీనివాస్, ఆళ్వార్ మురళీ, పూసా మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

## దుష్ప్రచారం చేస్తున్న

వైసిపి మూకలపై కఠిన చర్యలు తీసుకోండి -ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు టిడిపి నేతలు వినతి

తిరుమల,జూన్ 1 ప్రభాతవార్తప్రతినిధి:



ఎంతో పవిత్రంగా భక్తులకు సేవలందిస్తున్న టిటిడి బోర్డు ,అధికారులపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్న వైసిపి మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి నేతలు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఛైర్మన్ బిఆర్‌నాయుడును విమానాశ్రయంలో కలిసి తిరుమలను లక్ష్యంగా చేసుకుని అసత్యప్రచారాలు చేస్తున్న వైసిపి నేతలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. దీనిపై ఛైర్మన్ స్పందిస్తూ అసత్యప్రచారాలు, దుష్ప్రచారాలు, అనవసర వివాదాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరించేందుకు సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించి కొత్త చట్టం తీసుకువస్తామని అన్నారు. ఛైర్మన్‌ను కలసిన వారిలో డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, టిడిపి నేతలు ఊట్ల సురేంద్రకుమార్, రుద్రకోటి సదాశివం, సుబ్బుయాదవ్, దనంజయ్, హేమంత్‌కుమార్ ఉన్నారు.

## వైసిపి వంకరబుద్ధి మానుకోవాలి

తిరుపతి, జూన్ 1 ప్రభాతవార్త:



తిరుపతినగరంలో ప్రశాంతతను దెబ్బతీసి, అభివృద్ధిపేరుతో దోచుకుని దాముకున్న జనం డబ్బుకు సమాధానం చెప్పాల్సిందిపోయి వెన్నుపోటునాటకం ఎవరికోసం చేస్తున్నారని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టేహేమంత్‌రాయల్ ప్రశ్నించారు. 2019 ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి సొంత బాబాయి వివేకానందరెడ్డిని హత్యచేసిన వారిని పక్కన పెట్టుకుని ఐదేళ్ళు పాలనచేసిన వారు వెన్నుపోటు దినం అని తిరుపతి వైసిపి నాయకులను ప్రశ్నించారు. సొంత తల్లి విజయమ్మను, చెల్లి షర్మిలనుమోసంచేసి వెన్నుపోటుదినంగా చేయడం ఎందుకని విమర్శించారు. వైసిపి వంకరబుద్ధిని, అధిక బుద్ధిని మానుకోవాలని లేదంటే రానున్న రోజుల్లో పంచాయతి ,కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలే బుద్దిచెబుతారని హేమంత్‌రాయల్ అన్నారు.ఏప డ్రామాలు చేసినా,ఐదేళ్ళు ఎలా బెదిరించారు. ఎలా జనాన్ని మోసం చేశారనేది తెలుసని, ప్రజలు మీ డ్రామాలు నమ్మేపరిస్థితిలో లేరని అన్నారు.

## స్పీడ్ బ్రేకర్ ఎత్తు తగ్గించండి సారూ!

పాకాల, జూన్ 1, ప్రభాతవార్త



పాకాల మండలం పూతలపట్టు నాయుడుపేట రహదారిపై నేద్రగుంట పెనుమూరు క్రాస్ పై ఓవర్ బ్రిడ్జి ముందు నేషనల్ హైవే వారు అత్యుత్సాహంతో నిబంధనలు విరుద్ధంగా వెడల్పు తక్కువ ఎత్తు చాలా ఎక్కువగా స్పీడ్ బ్రేకర్ వేయడంతో లో లెవెల్ కారు లాంటి వాహనదారులు ప్రతి నిత్యం స్పీడ్ బ్రేకర్ దాటే సమయంలో వాహనాలు ఇంజన్ కింది భాగం తగులుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటుగా వెళ్లే ప్రతి కారు ముందు భాగం కారు కింది భాగం ఫీడ్ బ్రేకర్‌కు బలంగా తగులుతూ ఉండడంతో తరచూ తమ వాహనాలు భారీగా మరమత్తులకు గురవుతున్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా హైవే అథారిటీ వారు చెరువు కట్టలా ఉన్న స్పీడ్ బ్రేకర్‌ని కొద్దిగా ఎత్తు తగ్గించి వెడల్పు పెంచవలసినదిగా వాహనదారులు కోరుతున్నారు.

## నిత్యవసర సరుకులు చౌకదుకాణాలలోనే..!

టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 1 ప్రభాతవార్త:



నిత్యవసర సరుకులు చౌకదుకాణాల ద్వారానే పంపిణీ చేయనున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి తెలిపారు. ఆదివారం బలిజపల్లి, పివి పురం చౌకదుకాణాలలో నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని తహశీల్దార్ వెంకటరమణతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండియు వాహన ఆపరేటర్లు రేషన్ సరుకుల పంపిణీలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. డీలర్లు సక్రమంగా సరఫరా చేయనట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని సిఎస్ డిటి యుగంధర్ సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జనార్ధన్ చౌదరి, కొట్టే నరశింహారెడ్డి, విజయ్‌కుమార్ రాయల్, త్యాగరాజులు రాయల్, రామేష్ రాయల్, రమేష్ రెడ్డి, సుగుణమ్మ, హరీష్, వెంకటరమణారెడ్డి, మల్లిరెడ్డి, నరశింహారెడ్డి, డీలర్లు రాజేష్ రాయల్, భూపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ధనంజయరెడ్డికి నూకతోటి రాజేష్ పరామర్శ

కేవీబీ పురం, జూన్ 1 ప్రభాతవార్త:

వైసీపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు తెరణి ధనంజయరెడ్డిని వైసీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పరామర్శించారు. ఆయన మామ వెంగళం రాజగోపాల్‌రెడ్డి(90) మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాజేష్ కేవీబీ పురంకు చేరుకుని రాజగోపాల్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు కుమారుడు మునిరత్నంరెడ్డి, అల్లుడు ధనంజయరెడ్డిని పరామర్శించారు. రాజేష్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు లాల్ బాబుయాదవ్, నందకుమార్, దేవళ్ళ మణి, బాల, బీసీసెల్ నేత హరిబాబు, సర్పంచ్‌గిరి బాబు, రాయపేడు నాగయ్య, మణి, హరి ఉన్నారు.

## కేవీబీ పురం మండలంలో చౌక దుకాణం పునఃప్రారంభం

కేవీబీ పురం, జూన్ 1 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్‌ల సహకారంతో సత్యవేడు నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తామని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం కేవీబీ పురం మండలం కళత్తూరు గ్రామంలో చౌక దుకాణాన్ని పునఃప్రారంభించారు. మండల నాయకులు ఆయనను శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, కళత్తూరు మాజీ సర్పంచ్ గోవర్ధన్‌యాదవ్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు థామస్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సాదు, బీజేపీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## వైభవంగా దుర్యోధన వధ

శ్రీరంగరాజపురం, జూన్ 1 ప్రభాతవార్త:



మండల పరిధిలోని తయ్యూరు పాయకట్టు అంకనపల్లి శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల మహభారత ఉత్సవాల్లో చివరి రోజు ఆదివారం దుర్యోధన వధ ఘట్టంను వైభవంగా నిర్వహించారు. ఈ దుర్యోధన వధ ఘట్టానికి శ్రీరంగరాజపురం మండల పరిసర ప్రాంతాల్లోని ప్రజలతో పాటు తమిళనాడు రాష్ట్రం నుండి అత్యధికులు హాజరు కావడంతో ఈ కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ లింగారెడ్డి, ఆలయ నిర్వాహకులు రామనాథరెడ్డి, లోకనాథరెడ్డి, డిసెంబర్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పురుషోత్తం శెట్టి, గోవిందస్వామినాయుడు తదితరులు భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించారు.

# రేషన్ బియ్యాన్ని కూడా అమ్ముకున్న వైసిపి ప్రభుత్వం

## - ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



గూడూరు, జూన్ 1, ప్రభాతవార్త

గత వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు అందించే రేషన్ బియ్యాన్ని కూడా అక్రమంగా అమ్ముకున్నారని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ గుర్తు చేశారు. గూడూరు పట్టణంలోని సొసైటీ సెంటర్ ఐసిఎస్ రోడ్డు టూ టౌన్ ప్రాంతాల్లో రేషన్ షాపులను ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభించారు. ప్రజలకు నిత్యవసర రేషన్ బియ్యాన్ని అందజేశారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈరోజు పండుగ వాతావరణంలో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దుకాణాలు ప్రారంభమయ్యాయి అని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో రేషన్ బియ్యాన్ని కూడా అక్రమంగా అమ్ముకున్నారని గుర్తు చేశారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత పాత పద్ధతిలోనే రేషన్ దుకాణాలు మళ్లీ ప్రారంభించడం జరిగిందని, 65 సంవత్సరాలు నిండిన, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకే రేషన్ బియ్యం అందించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిలం కిరణ్ కుమార్, రవికుమార్, పేటేటి చంద్రనీల్, శ్రీనివాసులు, వెంకు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## కూటమి పాలనలో ప్రజలకు మేలు

### - టిడిపి మండల అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు



ఓజిలి, మే 1, ప్రభాతవార్త

కూటమి పాలనలో ప్రజలకు మేలు కలుగుతోందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గుజ్జలపూడి విజయ్ కుమార్ నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఓజిలి మండలంలోని పున్నేపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గుజ్జలపూడి విజయ్ కుమార్ నాయుడు రేషన్ ద్వారా నిత్యవసర వస్తువులనపంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యంల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలియజేశారు.

## వీరరెడ్డిపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గూడూరు, జూన్ 1, ప్రభాతవార్త

గూడూరు పట్టణం 2 పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరరెడ్డిపల్లి సమీపంలోని ప్రైవేట్ లేఅవుట్ వద్ద గుర్తు తెలియని పురుషుని మృతదేహం కనిపించింది. వయస్సు సుమారు 35 - 40 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. ముఖంపై పదునైన ఆయుధంతో దాడి జరగడం వల్ల మృతి చెందినట్లు భావిస్తున్నారు. గూడూరు 2 టౌన్ పోలీస్ వారు మర్డర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి లక్షణాలు ఎత్తు: 5 అడుగులు 6 అంగుళాలు, రంగు: చామనచాయ, కుడి చేతిపై అశోక్ (హిందీలో) పచ్చబొట్టు, ఎడమ చేతి పై తెల్లు బొమ్మ పచ్చబొట్టు ఉందన్నారు. దుస్తులు లైట్ గ్రే లోయర్ ధరించివున్నాడు. గూడూరు డీఎస్పీ గీతా కుమారి ఘటన స్థలాన్ని సందర్శించి, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో దర్యాప్తు చేస్తున్నారు. పై మృతదేహాన్ని ఎవ్వరన్నా గుర్తించినా వెంటనే గూడూరు పట్టణం 2 పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి చేసారు.

## మోటార్‌సైకిల్ బోల్తా: ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు ...

నాయుడుపేట, జూన్ 01 ప్రభాతవార్త ;

నాయుడుపేట మండలంలోని చలివేంద్ర సమీపంలో మోటార్‌సైకిల్ బోల్తాపడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. సేకరించిన సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి. మేనకూరుకు చెందిన సాయి, భానుప్రకాష్‌లు మోటార్‌సైకిల్‌పై నాయుడుపేటలో పనులు పూర్తిచేసుకొని తిరిగి మేనకూరుకు వస్తున్న సమయంలో చలివేంద్ర వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాధవశాత్తు మోటార్‌సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న సాయి, భానుప్రకాష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్సనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాయుడుపేట పోలీసులు కేసునమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## ఉచిత వైద్య శిబిరం చేయడం అభినందనీయం

గూడూరు, జూన్ 1, ప్రభాతవార్త



గూడూరు రెండో పట్టణ పరిధిలోని విఎస్ఆర్ పాఠశాలలో స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ పాల్గొన్నారు. విఎస్ఆర్ పాఠశాలలో స్ఫూర్తి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల చెందిన ప్రజలు వచ్చి వైద్య పరీక్షల నిర్వహించుకున్నారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కువగా పేద ప్రజలు ఉన్నారని వారి వైద్యం కొరకు స్ఫూర్తి సేవా సమితి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అలాగే వైద్యులు పేదల ప్రజలకు ఫీజుల్లో కొంత రాయితీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మాజీ మేయర్ నంది మండలం భాను శ్రీ, చదలవాడ హరిప్రసాద్, బాలకృష్ణం రాజు, లక్ష్మినారాయణ రాజు, నరసరాజు, వెంకటేశ్వర్లు, మస్తాన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## చౌక దుకాణాల ద్వారా రేషన్ బియ్యం పునః ప్రారంభం

పెళ్లకూరు జూన్ 1 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం మరల చౌక దుకాణాల ద్వారానే నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో మండలంలోని తల్వాయిపాడు గ్రామంలో సివిల్ సప్లై డిటి గోపీనాథ్ రెడ్డి స్థానిక తహసిల్దార్ ద్వారకానాథ్ రెడ్డిలు రేషన్ షాపులు ప్రారంభించి పేదలకు బియ్యం పంపిణీ చేశారు. అదేవిధంగా మండల కేంద్రమైన పెళ్లకూరులో టిడిపి సీనియర్ నాయకులు వేలూరు మురళీకృష్ణారెడ్డి పేరం రమేష్ నాయుడు నాగేంద్ర ప్రసాద్ రెడ్డి చైతన్య కృష్ణారెడ్డి తదితరులు రేషన్ బియ్యం పేదలకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు గంగా బత్తిన శ్రీనివాసులు. రామకృష్ణ. భాస్కర్. బాలయ్య. రాకేష్ రెడ్డి. లోకేష్ నాయుడు పోలయ్య ఉన్నారు.

## పాలసీన ముఖచిత్రం పుస్తకం ఆవిష్కరణ



వెంకటగిరి, జూన్ 1, ప్రభాతవార్త

రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ ప్రచురించిన పాలస్తీనా ముఖచిత్రం పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఉదయం ఆర్విఎం ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగింది. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య సభకు అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.సునీత తొలి ప్రతిని ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు గౌస్ బాషాకి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలస్తీనాని దురాక్రమించే కాంక్షతో ఇజ్రాయిల్, అమెరికా కలగలిసి గాజా పై దాడి చేస్తున్నారని, 50వేల మంది ప్రజానీకాన్ని పొట్టన పెట్టుకున్నారని దీన్ని అందరూ ఖండించాలని అన్నారు. గాజాలో ఏం జరుగుతుందో ప్రజలకు తెలియ జేయడానికే మేము ఈ పుస్తకాన్ని ప్రచురించామని, రాష్ట్రవ్యాప్తంగా ఆవిష్కరణ సభలు పెట్టి విషయాలు తెలియపరుస్తున్నామని చెప్పారు. ఏఐఎఫ్టియు న్యూ జిల్లా నాయకులు ఎల్ లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ యూదులకు ఆశ్రయం కల్పించిన పాలస్తీనావాసులకు నిలువ నీడ లేకుండా చేస్తున్నారని, పాలస్తీనా జాతి హననానికి పూనుకుంటున్నారని ఆరోపించారు. ఎ పి టి ఎఫ్ సీనియర్ నాయకులు పి గౌస్ బాషా మాట్లాడుతూ అంతర్జాతీయ మీడియా సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో ఉందని గాజాలో స్వేచ్ఛ కోసం పోరాడుతున్న వారిని ఉగ్రవాదులని ముద్ర వేయడం సరికాదని దేశం కోసం పోరాడే వారిని దేశభక్తులు అనాలని అన్నారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.అజిత, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ సుబ్బరాయుడు, పిడిఎస్ఓ పట్టణ నాయకులు సిహెచ్ పవన్ మాట్లాడారు. రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు జి. కృష్ణారెడ్డి, జి. తిరుపాలు, ప్రజాతంత్ర చేనేత సంఘం అధ్యక్షులు సి హెచ్. చిన్న ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి

### - వైసిపి జిల్లా మాజీ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ



వెంకటగిరి, జూన్ 1, ప్రభాతవార్త

ఈనెల 4వ తేదీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశం మేరకు నిర్వహిస్తున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా మాజీ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ తెలిపారు. వెన్నుపోటు దినం కరపత్రాలను నేదురుపల్లి నివాస గృహంలో వైసీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీ రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని తెలిపారు. ప్రజల సీఎం చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, కౌన్సిలర్ కళ్యాణి, గోపాలకృష, నాయకులు ప్రసాద్ రెడ్డి, దశరమిరెడ్డి చింతల శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభించిన రేషన్ షాపులు

వాకాడు, జూన్ 1, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదివారం టిడిపి మండల కన్వీనర్ మధు రెడ్డి, సన్నారెడ్డి విజయ శేఖర్, సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, సర్పంచ్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, దయాకర్, మండల స్థాయి అధికారులు తాసిల్దార్ రామయ్య, డిప్యూటీ తాసిల్దార్ సందీప్ కుమార్, వీఆర్వోలు కలిసి పాత పద్ధతిలోనే నూతనంగా రేషన్ షాపులను ప్రారంభించారు. తాసిల్దార్ రామయ్య మాట్లాడుతూ మండలంలోని 30 రేషన్ షావులను ప్రారంభించడం జరిగిందని అన్నారు. 15 రోజులు రేషన్ నిత్యవసర సరుకులు రేషన్ షాపులోనే డీలర్లు ఇస్తారన్నారు, ఒకటో తేదీ నుండి ఆయుధచేతి వరకు దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషను అందజేస్తామని తెలిపారు.

## జూన్ 4న జరిగే వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయండి

### ఎమ్మెల్సీ మేరీగా మురళీ పిలుపు

గూడూరు, జూన్ 1, ప్రభాతవార్త

టిడిపి ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావస్తున్న ఇప్పటికి పూర్తిస్థాయిలో పథకాలు అమలు కావడం లేదని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తూ జూన్ 4వ తేదీ వైసిపి పార్టీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినోత్సవం జరుగుతుందని కార్యకర్తలు నాయకులు పాల్గొనాలని ఎమ్మెల్సీ మేరీగా మురళి పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్సీ మేరీగా మురళి కార్యాలయంలో జరిగిన లేఖల సమావేశంలో వెన్నుపోటు దినోత్సవ పాంప్లెట్లను ఎమ్మెల్సీ మేరీగా మురళి వైసీపీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరీగా మురళి మాట్లాడుతూ జూన్ 4వ తేదీ కి టిడిపి ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావస్తున్న ఇప్పటికీ ఏ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని అన్నారు ఎప్పటిలాగే ఇచ్చిన హామీల నెరవేర్చకుండా టిడిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని దీన్ని వ్యతిరేకిస్తూ వెన్నుపోటు దినోత్సవం జరుగుతుందని గూడూరు టవర్ క్లాక్ సెంటర్ నుండి ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేయడం జరుగుతుందని నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు చేవూరు విజయ మోహన్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, సునీల్ రెడ్డి గురవయ్య సంపత్ కుమార్ రెడ్డి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ



సూళ్లూరుపేట, జూన్ 1 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గతంలో మాదిరిగా రేషన్ డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేసే కార్యక్రమానికి ఆదివారం శ్రీకారంచుట్టారు. సూళ్లూరుపేట తహశీల్దార్ నరసింహారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లా డుతూ ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా డీలర్ల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. 65 ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు లేదా మంచం మీద ఉన్న వారికి ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని చెప్పారు. జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు ప్రతి రేషన్ షాపులో పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. అనంతరం ఇందిరానగర్‌లో రేషన్ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజగోపాల్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్, దంతాల రవి, వంశీ, ఇవి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరుపల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోట, జూన్ 1 ప్రభాతవార్త



ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ 2001-2002లో 10వ తరగతి చదివి 25 సంవత్సరాల తర్వాత ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆదివారం కోట మండలం నెల్లూరుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా తమకు చదువు చెప్పిన నాటి గురువులు వేమూరి విజయకుమార్, సురేంద్రబాబు, శ్రీనివాసులును పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఆహ్లాదకర వాతావరణంలో నాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. వేదికపైకి ఒక్కొక్కరుగా వచ్చి పరిచయాలు చేసుకుని ఏ రంగాల్లో ఉన్నారో వివరించారు. చదువుకున్న పాఠశాలకు తమ శక్తి మేర అభివృద్ధి చేస్తామని పూర్వ విద్యార్థులు స్పష్టం చేశారు. అనంతరం సామూహిక విందు ఏర్పాటు చేశారు.

## అట్టహాసంగా రేషన్ పంపిణీ

కోట, జూన్ 1 ప్రభాతవార్త



కోట మండలంలోని 33 రేషన్ షాపుల్లో 16,782 రేషన్‌కార్డుదారులకు ఆదివారం నిత్యావసర సరుకులను కూటమి నాయకులు, అధికారులు పంపిణీ చేశారు. కోటలో నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, తీగల సురేష్‌బాబు, దారా సురేష్, మొబిన్‌బాషా, సర్పంచ్ వెంకటరమణమ్మ, షంషుద్దీన్ తదితరులు ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల్లో వినియోగదారులకు సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి, వికలాంగులకు డీలర్లే వెళ్లి సరుకులు అందజేస్తారని తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలు, అవినీతికి తావు లేదన్నారు. అలాగే చెందోడులో మాజీ ఎంపిటిసి బాలసుబ్రహ్మణ్యం, వాకా విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. విఆర్ఓ గౌతమి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కొత్తకళతో స్వాగతం పలికిన రేషన్ షాపులు

కోట, జూన్ 1 ప్రభాతవార్త



రేషన్ బండి సైరన్ ఎప్పుడు వినిపిస్తుందా అని ఎదురు చూడక్క రలేదు. కేటాయించిన రేషన్ దుకాణా నికి పదిహేను రోజుల్లో నచ్చినప్పుడు వెళ్లి రేషన్ తీసుకోచ్చును. ఆదివారం ఉదయం 8గంటలకే కూటమి నాయకులు, అధికారులు నిత్యావసర సరకుల పంపిణీని ప్రారంభించారు. ఆమేరకు మండల తహిసీల్దార్ కె.జయజయరావు, చెందోడు, చంద్రశేఖపురం, చిట్టేడు, ఊనుగుంటపాళెం, కేశవరం, తదితర గ్రామాల్లోని రేషన్ దుకాణాల ప్రారంభత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహిసీల్దార్ కె.జయజయరావు మాట్లాడుతూ రోజు ఉధయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గటల వరకు డిపోలన్నీ తెరిచి ఉంచాలని కోరారు. ప్రతి దుకాణం పరిధిలో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే సరకులు అందిస్తారని పేర్కొన్నారు. రేషన్ షాపుల వద్ద తోరణాలు పూలు, కట్టి అందంగా అలంకరించారు. దీంతో పాటు ధరల పట్టిక ప్రధాని మోదీ, సీఎం చద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫోటోలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు ఎమ్మెల్యేచే ఆవిష్కరణ

గూడూరు, జూన్ 1, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని రాజా వీధిలో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే సునీల్ కుమార్, ఉత్సవ కమిటీ చైర్మన్ కంటి రామ్మోహన్ రావు ఆవిష్కరించారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే, ఫెస్టివల్ కమిటీ చైర్మన్ ఈవో విడుదల చేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ఉత్సవ కమిటీ చైర్మన్‌గా మంచి వ్యక్తి సేవా మూర్తి కంటి రామ్మోహన్ రావును ఎంపిక చేసామని తెలిపారు. అభయ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, అమరయ్య నాయుడు, గోపాల్, శివరంజని, ఈవో రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, జూన్ 1 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్ ఆదివారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యా దలతో రాజగోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీనాయుడు, స్థానిక ఎస్సై ధరణీధరతో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గోవిందరాజుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

### -నేటి నుండి వాహనసేవలు



తిరుపతి, జూన్ 1ప్రభాతవార్త:

శ్రీగోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకురార్పణ జరిగింది. సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారుజ. నేటి ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహనంతో మొదలయ్యే స్వామివారి వాహనసేవలు, 4వతేదీ ఉదయం సింహవాహనం, 6వతేదీ రాత్రి గరుడ వాహనం, 7న రాత్రి గజవాహనం, జూన్ 9న ఉదయం రథోత్సవం, 10న ఉదయం చక్రస్నానంతో ముగుస్తాయి. అంకురార్పణలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ ఈఓ ,అర్చకులు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ దగ్గర చేసిన ప్రభుత్వం

### - ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం

### - లాంఛనంగా రేషన్‌షాపుల్లో సరుకుల పంపిణీ మొదలు !!

కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త



వైఎస్సార్సీ పాలనలో ఇళ్ల వద్దకే నిత్యావసరాలు అంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం కుప్పం పట్టణంలోని 5,6,7, 8,9,10చౌక దుకాణాల్లో నిత్యావసరాల పంపిణీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎండియు వాహనాలు వైకాపాపాలనలో పెట్టి ప్రజలకు ఏ సమయంలో ఎక్కడ నిత్యావసరాలు అందిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ చిట్టిబాబు, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, తిలగవతి, హంస, కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, మునెప్ప, హర్ష ధర్మతేజ, సుకుమార్, మురళి, రాహుల్, మణి, ఉదయ్, సల్మాన్, వరదరాజులు, జయమ్మ, అన్సర్, బాబు, హరి పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఈయూలో సండేస్ ఆన్ సైకిల్

తిరుపతి విద్య జూన్ 1 ప్రభాతవార్త



కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, ఇండియన్ యూనివర్సిటీస్ అసోసియేషన్, విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఫిట్నెస్, సస్టైనబిలిటీ, కమ్యూనిటీ స్పిరిట్ను ప్రోత్సహిస్తూ ఆదివారం జాతీయ సంస్కృత వర్సిటీలో “సండేస్ ఆన్ సైకిల్” ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రెటరీ వి సేతురాం, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ద్రౌపదీ ధర్మరాజుల గ్రామోత్సవం

శ్రీకాళహస్తిరూరల్, జూన్1 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలోని పాతవీరాపురం గ్రామంలో జరుగుతున్న శ్రీకృష్ణద్రౌపదీ ధర్మరాజుల స్వామి 51వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేక పూలాలంకరణతో అలంకరించారు. స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి, అనంతరం శ్రీకృష్ణద్రౌపదీ ధర్మరాజుల వారిని గ్రామోత్సవం నిర్వహించి మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక హార తులు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ కొంగర క్రిష్ణారెడ్డి, మాజీజెడ్పిటిసి మునిరంగారెడ్డి, మునిధర్మారెడ్డి, చెంచురెడ్డి, మునిరత్నంరెడ్డి, పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యాశాఖాధికారి జి. రాజశేఖర్‌రెడ్డికి రవి ఘన సన్మానం

తిరుపతి విద్య, జూన్ 1 ప్రభాతవార్త ః



సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా ఇంటర్మీయట్ విద్యాశాఖాధికారిగా జి. రాజశేఖర్‌రెడ్డి నియమితులైయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీ ప్రభుత్వ ఇంటర్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర నేత రవి, అసోసియేషన్ సభ్యులు తిరుపతి జిల్లా ఇంటర్మీయట్ విద్యాశాఖాధికారి జి. రాజశేఖర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను రవి, అసోసియేషన్ నేతలు, సభ్యులు శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. జి. రాజశేఖర్‌రెడ్డి మరెన్నో ఉన్నత పదవులు పొందాలని రవి ఆకాంక్షించారు.